పోషకాహారంపై అవగాహన

బెజ్జూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం కార్యదర్శులు, వీఓఏలకు ఏపీఎంలు చంద్రశేఖర్, మోహన్‌లాల్ పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందక పోవడంతో రక్తహీనత కలిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. దీనిపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ నాగరాణి, భద్రయ్య, ఎమ్మెస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

సిర్పూర్(యు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రెసిడెంట్ గూడ, ఖాతీగూడ, దేవుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలను శనివారం మహగాం స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజురు అయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదిని సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు, మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మహగాం స్కూల్ కాంప్లెక్స్ ఎసీఆర్పీ మండాడి గాగ్రు, ఉపాధ్యాయుడు కృష్ణాప్రసాద్, లక్ష్మణ్, ఆత్రం ప్రభు, పాఠశాల కమిటీ చైర్మన్ సేడ్మకి జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సమాజ్ రత్న రాష్ట్రీయ అవార్డుకు ఎంపిక

వాంకిడి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ సమాజ్ రత్న రాష్ట్రీయ అవార్డుకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి వాంకిడి మండల వాసులు బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్కార్ అశోక్, సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జీ దుర్గం సందీప్ ఎంపికయ్యారని అఖిల భారత గురు రవిదాస్ సమతా పరిషత్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, సాహిత్య వెత్త మధు బావల్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ఆదిలాబాద్ పట్టణంలో అఖిల భారత గురురవి దాస్ సమతా పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో గురు రవిదాస్ జయంతి సందర్భంగా ఈ అవార్డులను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ సామాజిక కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నందుకు గాను వారిని ప్రోత్సహించడానికి ఈ అవార్డులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఒకరు లేక ఇద్దరు ముద్దు.. ముగ్గురు వద్దే వద్దు.. ఇదీ జనాభా నియంత్రణలో భాగంగా ప్రభుత్వం చేస్తున్న ప్రచారం. కానీ జనాభా నియంత్రణలో ముఖ్య పాత్ర అయిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జిల్లాలో ఐదేళ్లుగా నిలిచిపోయాయి. అధికారులు శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో అవసరమైన వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఇది పేదలకు ఆర్థికంగా భారంగా మారుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తిరిగి శిబిరాలను నిర్వహించాలని కోరుతున్నా ఉన్నతాధికారుల నుంచి కార్యాచరణ కరువైంది.



కు.ని.కి పాట్లు

ఐదేళ్లుగా నిలిచిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

- జిల్లాలో సర్జన్‌ల కొరత
- విధిలేక ప్రైవేట్ వైపు మొగ్గు
- పేదలపై తప్పని భారం
- ప్రోత్సాహకానికి దూరం

బెజ్జూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐదేళ్లుగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. కుటుంబ నియంత్రణ శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కరోనా విజృంభణ కాలం నుంచి శిబిరాల నిర్వహణ పూర్తిగా నిలిపివేశారు. కరోనా పూర్తిగా నియంత్రణలోకి వచ్చినా ప్రభుత్వం కుటుంబ నియంత్రణ శిబిరాలు ఏర్పాటు చేయలేదు. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా దీనిపై శ్రద్ధ వహించాలని పేద ప్రజలు కోరుతున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయని కారణంగా పేద ప్రజలకు ఆర్థిక భారం పడుతోంది. గ్రామీణ ప్రాంతాల పేద మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

● ప్రాంతీయ ఆస్పత్రుల్లో..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్(టి), వాంకిడి, తిర్యాణి, జైనూరు, కాగజ్‌నగర్, బెజ్జూరు మండలాల్లో ప్రాంతీయ ఆస్పత్రులున్నాయి. వాటితో పాటు జిల్లాలో 20ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కరోనాకు ముందు జూలైలో ఒక్క కాగజ్‌నగర్‌లో మాత్రమే కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహించారు. గతంలో కరోనాకు ముందు కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహించేవారు. రానురానూ ఎందువల్లో వాటిల్లో పూర్తిగా నిలిపి వేశారు. ఇక కరోనా వ్యాప్తితో గత ఐదేళ్లుగా మారుమూల ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలు పూర్తిగా నిలిపి వేయడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా శిబిరాల ఊసు లేని కారణంగా శస్త్ర చికిత్సలు చేసుకోవడానికి ప్రైవేటుకు వెళ్లక తప్పడం లేదు.

● తప్పని అవస్థలు..

ముఖ్యంగా జిల్లాలో అధిక శాతం పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే ఉన్నారు. వీరు ఆర్థికంగా లేకపోవడంతో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేయించుకునేందుకు మొగ్గు చూపుతారు. ఈ క్రమంలో ఆస్పత్రుల్లో శిబిరాలు ఏర్పాటు చేయని కారణంగా ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తోంది. ఇది ఖర్చుతో కూడి ఉండడంతో పేదలకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం మాత్రం గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు, ఉచిత వైద్యం అంటూ చెబుతోంది. కానీ ఆచరణలో అమలు కావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల కోసం స్థానిక ఆస్పత్రులకు వస్తే అక్కడి సిబ్బంది మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి రెఫర్ చేస్తున్నారు. దీంతో దూరభారంతో పాటు ఖర్చు కూడా పెరుగుతుందని పేద ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వం స్థానికంగానే శిబిరాలు నిర్వహిస్తే అనుకూలమని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● శస్త్ర చికిత్స చేసే సర్జన్లు లేక..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్స చేసే వైద్యులు లేకపోవడంతోనూ కుటుంబ నియంత్రణ శిబిరాల నిర్వహణ కష్టంగా మారింది. గతంలో జిల్లాలో కొంత మంది సర్జన్‌లు ఉండడంతో అక్కడక్కడా కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహించేవారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేయడానికి డాక్టర్లు కూడా మొగ్గు చూపని కారణంగా ఆశయం నెరవేరడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్కువ వేతనాలు, ఇతర సౌకర్యాలు లేక కొత్తగా డాక్టర్లు రావడానికి ఇష్టపడటం లేదన్న వాదనలు ఉన్నాయి. దీంతో గత కొద్దేళ్లుగా శిబిరాలు నిర్వహించడం లేదు. ఇక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో ఈసారైనా శస్త్ర చికిత్సలు ఏర్పాటు చేస్తారేమోనని గ్రామీణ ప్రాంత పేదలు ఎదురుచూస్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పేదలు ఉన్నారు. వీరు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

● గతంలో ఏడాదికి రెండు సార్లు..

ఐదేళ్లకు ముందు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాదికి రెండు సార్లు చొప్పున కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహించిన వైద్య శాఖ అధికారులు ఇప్పుడు వాటిపై ఎలాంటి శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకునే వారికి ప్రోత్సాహకంగా గత ప్రభుత్వం రూ.880, వారిని శిబిరాలకు తరలించిన ఆశా కార్యకర్తలకు రూ.150 చెల్లించేది. ముఖ్యంగా జిల్లాలోని బెజ్జూరు, పెంచికలపేట, దహెగాం, చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల్లోని పలువురు పక్కనే ఉన్న మహారాష్ట్రలోని పలు ఆసుపత్రుల్లో అధికంగా శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిబిరాలు ఏర్పాటు చేయని కారణంగా అవ స్థల మధ్య మహారాష్ట్రకు వెళ్లి చేయించుకుంటున్నారు. మారుమూల ప్రాం తాల్లో గతంలో ప్రతి ఏటా శిబిరాలు ఏర్పాటు చేసిన అధికారులు కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో సరైన వసతులు లేవనే సాకుతో నిలిపి వేశారు.

ఆదేశాలు వస్తే శిబిరాలు నిర్వహిస్తాం..

- సీతారాం, జిల్లా వైద్యాధికారి, ఆసిఫాబాద్



ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిర్వహిస్తాం. జిల్లాలో సర్జన్ డాక్టర్ల కొరత ఉంది. దీంతో గత కొన్నేళ్లుగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించడం లేదు. గ్రామీణ ప్రాంతాల వారికి ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే.ఈ విషయంలో ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. రాబోయే రోజుల్లో కు.ని శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం. అత్యవసరమైతే శస్త్ర చికిత్సల కోసం మంచిర్యాలకు రెఫర్ చేస్తున్నాం.

విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు రాబోయే సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలని జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆసీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తరువాత విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ కళా శాలకు వెళ్లకుండా ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ పొంది ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు, తిరుపతి, పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం వివిధ వాహనాల్లో హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. సిర్పూరు నియోజవకర్గ కార్యకర్తలతో మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, ప్రైవేటు వాహనాల ద్వారా కార్యకర్తలు, నాయకులు వెళ్లారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాల యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కులగణన సర్వే అంశాలను పరిగణలోకి తీసుకుని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని జీవో పాస్ చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బాలేష్‌గౌడ్, రమేష్, మారుతి, దత్తు, శంకర్, శ్రీనివాస్, బసవయ్య, వినోద్, ధర్మయ్య, తిరుపతి, అసద్ పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్ శివారులోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి గంగాపూర్ ఆలయానికి వచ్చిన ఆయన అన్ని శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గంగాపూర్ జాతరకు వచ్చే భక్తులు రెబ్బెన నుంచి ఆలయం వరకు రాక పోకల సందర్భంగా ఏటా ఇబ్బందులను పడుతున్నారని చెప్పారు. ఈ సారి అలా జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలాన్ని గుర్తించాలన్నారు. గుడి చుట్టు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ఎండ బారిన పడకుండా ఆలయ పరిసరాల్లో షమియానాలను ఏర్పాటు చేయాలన్నారు. తాగు నీటి సౌకర్యం, మూత్ర శాలల ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర నలువైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు అసాంఘిక కార్యకలాపాలు కొనసాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. సంబంధిత లైన్‌మెన్లను ఆలయ అధికారులకు అందుబాటులో ఉంచాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్, డీసీఆర్‌బీ డీఎస్పీ కరుణాకర్, ఎస్సై చంద్రశేఖర్, తహసిల్దార్ రాంమోహన్ రావు, ఎంపీడీఓ శంకరమ్మ, ఇఓ బాపిరెడ్డి, కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో స్వామి వారికి కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు.

● తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యల ఫైళ్లను పరిశీలించారు. పలు రకాల ధ్రువ పత్రాల కోసం అందిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, విరాసత్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి మండలంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలను తహసీల్దార్ రాంమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు.

కోనప్ప కృషితోనే రోడ్డు పనులు పూర్తి



కోనప్ప చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కౌటాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఫలితంగానే ప్రధాన రహదారి నుంచి కంబారి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి అయిందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య అన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంబారి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారని చెప్పారు. వారి కష్టాలను తీర్చేందుకు మాజీ ఎమ్మెల్యే అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి కౌటాల- టేకంగూడ, ముత్తంపేట-పార్డి రోడ్లు మంజూరు కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వసంత్, మనీష్, సంతోష్, శ్రీనివాస్, అంజన్న, ప్రభాకర్‌గౌడ్, రమేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు 'వనదర్శిని'



వనదర్శినిలో పాల్గొన్న విద్యార్థులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చింతకుంట ఫారెస్టులో అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ అన్వర్ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపట్నం వ్యూ పాయింట్, సోలార్‌కుంట, చెక్ డ్యాం, చెట్టు, పక్షులు, జంతువుల అడుగులు చూపించారు. ఎఫ్‌ఆర్వో ఎక్బాల్ హుస్సేన్ అటవీ సంరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు అటవీ శాఖ సిబ్బంది చేస్తున్న పనులు, తీసుకుంటున్న చర్యలను వివరించారు. భవిష్యత్ రతాల మనుడగకు అటవీ సంరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ప్రసాదరావు, బీట్ అధికారులు, మల్లికార్జున్ రవీనా, వాచర్లు ఇర్ఫాన్, భీంరావు, లింగన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి విద్యాబోధన చేయాలని డీఈవో గమానియల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు చాక్‌పీస్ వాడకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యాబోధన చేయవచ్చని చెప్పారు. ఇంట్రా క్టివ్ ఫ్లాట్ ప్యానల్ ఉపయో గించుకుని విద్యాబోధనం చేయడం ద్వారా విద్యార్థులలో అభ్యసన ఫలితాలు త్వరగా సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు భరత్, రవికుమార్, లాలాజీ, రాజు, శాంతికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



బెజ్జూరులో బాణాసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు

బెజ్జూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో బాణా సంచా పేల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, రాకేష్, సంతోష్, రాజారాం, శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా ఎదురుచూపులే

- వేతనాలు అందక ఉపాధిహామీ సిబ్బంది అవస్థలు
- ప్రభుత్వం కనికరించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది(ఫైల్)

కెరమెరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసలు నివారించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఉపాధిహామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. 20 ఏళ్ల క్రితం కేంద్రం గ్రామాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి మాత్రం వేతనాలు సకాలంలో అందడం లేదు. దీంతో లేదు. దీంతో సమ్మెబాట పట్టేందుకు సన్నద్ధవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్‌లు, టీఏలు 75 మంది ఉన్నారు. ఎఫ్ఏలు 149 మంది, అటెండర్లు 7, కంప్యూటర్ ఆపరేటర్లు 36 మంది పని చేస్తున్నారు. వీరికి నవంబరు నుంచి వేతనాలు రావడం లేదు. ఎఫ్‌టీవో(ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)శాఖలో నిధులు లేక పోవడం వల్ల జీతాలు రావడం లేదని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. దీంతో కుటుంబాల పోషణకు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

● గ్రామాభివృద్ధిలో ఎంతో కీలకం..

గ్రామాల అభివృద్ధిలో ఉపాధిహామీ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, ప్రకృతి వనాలు, హరితహారం లాంటి కార్యక్రమాల అమలులో ఉపాధిహామీ సిబ్బందే కీలకంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డు గల ప్రతి ఒక్కరికీ ఏడాదిలో వంద రోజుల పనులు కల్పించడం, వారికి కూలీ డబ్బులను సకాలంలో చెల్లించేలా చర్యలు తుసుకోవడం వీరి విధి. అలాగే నీటి సంరక్షణకు నీటి కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణంతో పాటు రైతులకు అవసరమైన పథకాలను అమలు చేస్తుంటారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలోనూ ఉపాధిహామీ సిబ్బంది ఎంతో కీలకంగా మారారు. అలా విధుల్లో ఉన్న తమకు నెలనెలా వేతనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● దశల వారీగా నిరసనలు..

ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని దశల వారీగా నిరసనలు చేపడుతున్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గత నెల 29, 30వ తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి వినతిపత్రాలు సమర్పించారు. గత నెల 31, ఈ నెల 1న ఈజీఎస్ సిబ్బంది పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు మూడు తేదీల్లో ఎమ్మెల్యేలకు వినతులు, 4న కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేత కార్యక్రమం నిర్వహించారు. 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన, టీఎస్‌జీవో, టీజీవో ఉద్యోగ సంఘాల నాయకులకు సమస్యలు విన్నవించారు. 7న ప్రజాభవనలో ధర్నా చేపట్టారు. 8న పీఆర్ అండ్ సీఆర్డీ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. 9, 10 తేదీల్లో మంత్రులకు వినతి పత్రాలు అందజేయనున్నారు. 11న కమిషనర్ పీఆర్ అండ్ సీఆర్డీ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన, 12న కమిషనర్‌కు వినతి అందజేయనున్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మె చేపట్టాలని నిర్ణయించారు.

ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి..

- మల్లయ్య, ఏపీవో , కెరమెరి



ఉపాధిహామీ సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే మూడు నెలలుగా జీతాలు రాక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి.

పది క్వింటాళ్ల పత్తి దగ్ధం

నెన్నెల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుశ్నపల్లిలో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. గంగిరెడ్డి రాఘవరెడ్డి అనే రైతుకు చెందిన పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. తమ చేనులో రెండోసారి సేకరించిన 70 క్వింటాళ్ల పత్తిని ఓ ఇంట్లో నిల్వచేసి మరో చోట నివాసం ఉంటున్నారు. 12 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్గిరాజుకుని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి రైతుకు సమాచారం అందించారు. గ్రామస్థులు కరెంటు సరఫరా నిలిపివేసి బిందెలతో నీళ్లు పోసి మంటలను ఆర్పివేశారు. కాని అప్పటికే పది క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. మిగిలి ఉన్న పత్తి కూడా మసిబారి తడసి పాడై పోయిందని, తనకు రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. రేయింబవళ్లు కష్టం చేసి పండించిన పత్తి అమ్ముకునే సమయంలో కాలి బూడిదయిందని ఆవేదన చెందుతున్నాడు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించారు.

జాతరలో వేలంపాట ద్వారా రూ. 15.27 లక్షల ఆదాయం

జైపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వేలాల గ్రామంలో నిర్వహించే జాతరలో దుకాణాల నిర్వహణకు శనివారం వేలం పాట నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన వేలం పాటలో కొబ్బరి కాయల అమ్మకానికి రూ. 4.68 లక్షలు, వాహనాల పార్కింగ్‌కు రూ. 3.56 లక్షలు, వరిపేలాలు విక్రయానికి రూ. 60 వేలు, గుట్ట కింద లడ్డూ అమ్మకాలకు రూ. 4.23 లక్షలు, గుట్టపైన లడ్డూ విక్రయాలకు రూ. 2.20 లక్షలకు వ్యాపారులు వేలం పాడి దక్కించుకున్నారు. బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ. 15.27 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, గ్రామ ప్రత్యేకాధికారి విద్యాసాగర్, గ్రామ కార్యదర్శి రాకేష్, పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తుకు ప్రణాళిక సిద్ధం



- వేసవి నేపథ్యంలో అధికారుల చర్యలు
- ఓవర్‌లోడ్ తగ్గించడానికి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతరయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు జిల్లా విద్యుత్‌శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందు కోసం వేసవి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో రైతులు, గృహ, వాణిజ్యపరమైన వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. దీన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించారు. జిల్లాలో గత నెల 30న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి జిల్లాలో పర్యటించి అధికారులతో సమీక్షించారు. రాబోయే వేసవిలో వినియోగదారులకు ఎలాంటిలో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని అందుకు అవసరమైన అన్ని రకాల పరికరాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆదేశించడం జరిగింది.

పెరుగుతున్న కనెక్షన్లు..

జిల్లాలో కొత్తగా ఇళ్లు కట్టుకున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో కొత్త కనెక్షన్ల అవసరం ఏర్పడుతోంది. దాంతో పాటు ఇప్పటికే కనెక్షన్లు కలిగిన ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. మరో వైపు వేసవి సమయంలో ఇళ్లల్లో ఏసీ, కూలర్లు, ఫ్యాన్ల వాడకం కూడా పెరుగుతుంది. ఇలా వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి లోఓల్టేజీ సమస్య తలెత్తె అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులు ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయో అధికారులు గుర్తించారు. జిల్లాలో గత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పెరగబోయే విద్యుత్ డిమాండ్ అంచనా మేరకు కొత్తగా నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు చేయనున్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో నాలుగు పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచనున్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ల లోడ్ భారం అనుగుణంగా కొత్తగా 120 ట్రాన్స్ ఫార్మార్లను అమర్చనున్నారు. లోడ్ మేరకు 336 ట్రాన్స్ ఫార్మర్ల కేపాసిటీని పెంచనున్నారు.

మున్సిపాలిటీ, పట్టణాలలో అంత రాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి రింగ్ మెయిన్స్ వ్యవస్థను పటిష్టపరుస్తున్నారు. 11కేవీ ఫీడర్‌లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. బ్రేక్ డౌన్లను సాంకేతికంగా విశ్లేషించి వాటి ఆధారంగా బ్రేక్‌డౌన్ రెక్టిఫికేషన్ టీంలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా జిల్లాలో 33/11 కేవీ సబ్ స్టేషన్లు 36, 132/33 కేవీ కేంద్రాలు రెండు ఉన్నాయి. జిల్లాలో గృహ విద్యుత్ సర్వీసులు 1,39,944 ఉండగా వాణిజ్య సర్వీసులు 13,875, వ్యవసాయ సర్వీసులు 13, 528 సర్వీసులు, 628 చిన్న పెద్ద తరహ పరిశ్రమలు ఉన్నాయి.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా..

శేషారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ

వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేసవి యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నాం. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. వ్యవసాయ, గృహ, వాణిజ్య పరమైన విద్యుత్ వినియోగదారులకు నిరంతరంగా నాణ్య మైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమయ్య, ఫైర్ అధికారి, కాగజ్‌నగర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలేంటి?

ఫైర్ అధికారి: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాగజ్‌నగర్ ఫైర్ స్టేషన్ పరిధిలోని 7 మండలాలైన బెజ్జూరు, పెంచికల్ పేట, దహెగాం, కౌటాల, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్, సిర్పూర్ (టి) మండలాల్లో వారంలో ఐదు రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇళ్లల్లో అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?

ఫైర్ అధికారి: ఇళ్లల్లో వంటగదిలో ముఖ్యంగా రిఫ్రిజిరేటర్ లేకుండా చూసుకోవాలి. ఒక వేళ సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంట వ్యాపిస్తే వెంటనే ఆందోళన చెందుకుండా ఒక బక్కెట్టును రెగ్యులేటర్‌పై బోర్లించడం వల్ల మంటలు అదుపులోకి వస్తాయి. అనంతరం రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసుకొని ప్రమాదాలను నివారించవచ్చు.

ఆంధ్రజ్యోతి: షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలు, హాస్పిటల్స్, తదితర వాటిల్లో అగ్నిప్రమాదాలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఫైర్ అధికారి: వాణిజ్య, వ్యాపార సముదాయాల్లో అగ్నిప్రమాదాల విషయంలో అవ గాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా విద్యుత్ వైరింగ్ విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు ఉండాలని సూచనలు ఇస్తున్నాం.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు గణితం బోధించిన కలెక్టర్



విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఉపాధ్యాయుడిగా మారి పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థును గణితంలో సందేహాలను అడిగి తెలుసుకున్నారు. గణితాన్ని సులభతరంగా ఎలా చేయవచ్చో పలు విషయాలను వివరించారు. గంగాపూర్ జాతర పనులను పర్యవేక్షించడానికి వచ్చిన కలెక్టర్ గంగాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. అక్కడ పదో తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి పదో తరగతి పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠ్యంశాలకు సంబంధించిన ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబాట్టారు. ప్రతి ఒక్కరికి గణితం కష్టతరగా అన్పిస్తుందని చెప్పారు. కాని గణితం అర్థం చేసుకుంటే చాలా సులువైన అంశం అన్నారు. గణితం ఏవిధంగా నేర్చుకోవాలన్నది విషయాలను కలెక్టర్ బ్లాక్ బోర్డుపై రాసి చూపించారు. అనంతరం స్వయంగా విద్యార్థులతో లెక్కలు చేయించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాంమోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

● ఈవీఎంల రక్షణకు చర్యలు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల రక్షణకు సంబంధిత అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం వద్ద రక్షణ చర్యలు, ఈవీఎం గోదాంకు వేసి సీలు, గోదాంలో భద్ర పరిచిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను భద్ర పరిచిన తీరును, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈవీఎంల రక్షణ దిశగా తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భద్రత సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలు ఎల్లవేళలా పని చేయాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎన్నికల పర్యవేక్షకులు సునీల్, నాయబ్ తహసీల్దార్ శ్యాంలాల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మంగు(ఫైల్)

వాంకిడి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటగుడ గ్రామ సమీపంలో శుక్రవా రం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాటగుడ గ్రామానికి చెందిన సీడాం మంగు (35) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నానడు. శుక్రవారం వాంకిడిలో పనులు ముగించుకొని రాత్రి ద్విచక్ర వాహనంపై కొపగుడ గ్రామంలోని ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమత్తం ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

పీఎంఈజీపీ రుణాల పేరుతో మోసం

- జగిత్యాల జిల్లాలో లక్షల్లో వసూలు
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రైమ్ మినిస్టర్స్ ఎమ్ప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) కింద సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని జగిత్యాల జిల్లాలో వేణు వర్మ(35) అనే యువకుడు పలువురి నుంచి లక్షల్లో వసూలు చేశాడు. రుణాలు రాకపోవడంతో ఓ బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు శనివారం వేణు వర్మపై కేసు నమోదు చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌కు చెందిన వేణు వర్మ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తీన్ ఖని చౌరస్తా ప్రాంతంలో తన బంధువుల ఇంట్లో కొన్నాళ్లగా ఉంటున్నాడు. బ్యాంకులో పనిచేస్తున్నానని ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా పౌల్ట్రీ ఫామ్‌లు, వస్త్ర వ్యాపారాలు నెలకొల్పేందుకు 35 శాతం నుంచి 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇప్పిస్తానంటూ పలువురిని నమ్మబలికాడు. దీంతో పలువురు నిరుద్యోగులు, వ్యాపారులు పీఎంఈజీపీ పథకం కింద రుణాలు ఇప్పించాలని వేణు వర్మతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రుణం త్వరితగతిన రావడం కోసం బాధితులు లక్షలాది రూపాయలను, కొందరు బంగారాన్ని వేణువర్మకు అప్పగించారు. రుణాలు వస్తాయనే ఆశతో జగిత్యాల పట్టణంతో పాటు జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, మేడిపెల్లి మండలం వల్లంపట్ల గ్రామాలకు చెందిన పలువురు పీఎంఈజీపీ కింద దరఖాస్తు చేసుకున్నారు. మూడేళ్లగా రు ణం రాకపోవడంతో మోసపోయామని గమ నించిన బాధితులు శనివారం వేణు వర్మను జగిత్యాలలో పట్టుకుని నిలదీశారు. దాటవేసే ప్రయత్నం చేయడంతో బాధితులు వేణు వర్మను పోలీసులకు అప్పగించారు. జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన ఆనందం అనే బాధితుడు లోన్ కోసం వేణు వర్మకు రూ.20 లక్షల నగదు ఇచ్చి మోస పోయానని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

చెన్నూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజికి వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై శనివారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో రాష్ట్ర రెడ్డి సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోషం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రెడ్డి కులస్తులను కించపరుస్తూ మాట్లాడటం సరికాదన్నారు. ఇలాగే మాట్లాడితే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రెడ్డి కులస్తులపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదును జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రత్న సత్యనారాయణరెడ్డి, చీర్ల సుదర్శన్ రెడ్డి, కుంభం సంజీవరెడ్డి, ముల్కల్ల తిరుపతిరెడ్డి, తోడె రాజిరెడ్డి, రత్న లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి



డిమాండ్ల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆసిఫాబాద్ డిపో జేఏసీ చైర్మన్ దివాకర్ అన్నారు. ఆసిఫాబాద్ డిపో గేటు ఎదుట శనివారం కార్మికులతో కలిసి కార్మికుల డిమాండ్ల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, సీసీఎస్ డబ్బులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫల మైందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చిన అధికారులు

కౌటాల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అల్లూరి వసంత్ అనే వ్యక్తి నిర్మించుకుంటున్న ఇంటిని శుక్రవారం రాత్రి అటవీ శాఖాధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేశారు. కొన్నేళ్లుగా కంపౌండ్‌వాల్ కట్టుకుని ఇక్కడే ఉంటూ ఇంటిని నిర్మించుకునేందుకు పిల్లర్లు వేశారు. తన విషయంలో అధికారులు అన్యాయం చేశారని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై ఎఫ్ఆర్వో ఎక్బాల్‌ను వివరణ కోరగా కౌటాల సెక్షన్ పరిధిలోని 162 కంపార్టుమెంట్‌లో అక్రమ కట్టడాలు నిర్మించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చి వేసినట్లు ఆయన తెలిపారు. దానికి ముందు అతడికి నోటీసులు కూడా ఇచ్చామని వివరించారు. 162 కంపార్టుమెంట్‌లో ఇళ్లు నిర్మించుకుని ఉన్న వారందరికి త్వరలోనే నోటీసులు కూడా ఇవ్వనున్నామని తెలిపారు.

నేడు గూడెం సత్యదేవుడి కల్యాణం



ముస్తాబైన సత్యదేవుడి ప్రధాన ఆలయం

దండేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవంలో భాగంగా స్వామివారి కల్యా ణోత్సవానికి ఆలయం ముస్తాబైంది. ఆదివారం సాయంత్రం గోధూళిక సముహూర్తాన వైష్ణవ సంప్రదాయం ప్రకారం వేదమంత్రోచ్చరణ నడుమ కల్యాణం నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలకరించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. రూ.500 చెల్లించి కల్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థానం ఆధ్వర్యంలో లడ్డు ప్రసాదం శేషవస్త్రాలు అందజేయను న్నట్లు ఈవో వెల్లడించారు. స్వామివారి కల్యాణంకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.


మూడో రోజూ ప్రత్యేక పూజలు

స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం గూడెం రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం మూడో రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని బ్రహ్మోత్సవాలను తిలకించారు. అనంతరం సప్తాహ భజన కార్యక్రమం కొనసాగింది.

నలుగురు వ్యక్తులపై కేసు నమోదు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలోని ఓ బార్‌లో శుక్రవారం రాత్రి దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలానికి చెందిన బండారి వంశీ బార్‌లో మద్యం సేవిస్తుండగా ఆలస్యం కావడంతో ప్లేట్‌ను పడేశాడు. తమను చూసే ప్లేట్‌ను ఎత్తిపడేశాడని పక్క టేబుల్ వద్ద మద్యం సేవిస్తున్న అల్లి సాగర్, అతని స్నేహితులు వంశీపై బీరు సీసాలతో దాడికి పాల్పడ్డారు. దీంతో వంశీకి తలతో పాటు ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. వంశీ ఫిర్యాదు మేరకు అల్లి సాగర్‌తో పాటు రత్నం సోమయ్య, మామిడి అన్నమయ్య, ఫౌసిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మిట్టపల్లి వెంకటస్వామి

కాసిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం కార్మికులు రాజీలేని పోరా టాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు పని ప్రదేశాల్లో సరైన పనిముట్లు , మెటీరియల్, సేఫ్టీ గ్లౌజులు, బూట్లు, డబుల్ స్టాఫ్ రేకులు లేక కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్మికులపై అదనపు పనిభారం మోపి మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. కోల్‌మైన్స్ రెగ్యులేషన్ ప్రకారం వర్క్‌నామ్స్ అమలు పరుచాలని డిమాండ్ చేశారు. కాసిపేట 2వ గనిలో బొగ్గు ట్రాన్స్‌పోర్టు చేసేలా లారీలు సమయానికి అందుబాటులో లేక డంపింగ్ చేయడంతో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. దీని వల్ల బొగ్గు నాణ్యత, విలువ తగ్గి సంస్థకు నష్టం కలుగు తుందన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. ఉన్నత స్థాయిలో డైరెక్టర్‌లేక కార్మికుల సమస్యలు పరిష్కరించే వారు లేరన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడం వల్లనే సీఎండీ, డైరెక్టర్లను నియమించే విషయంలో ఆలస్యం జరుగుతుం దన్నారు. వెంటనే డైరెక్టర్లను, పూర్తిస్థాయి సీఎండీని నియమించాలని కోరారు. అనంతరం పలురు కార్మికులు యూనియన్‌లో చేరగా కండు వాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్ర మంలో పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, బెల్లంపల్లి బ్రాంచ్ ఇన్‌చార్జీ చిప్ప నర్సయ్య, కార్యద ర్శి దాగం మల్లేష్, నాయకులు నర్సయ్య, వెంకటేష్, సుభాష్‌చంద్రబోస్, కేతన్, కొమురయ్య, రాయలింగు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'ఐఎన్టీయూసీని విమర్శించే అర్హత టీబీజీకేఎస్ నాయకులకు లేదు'

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులకు అనేక హక్కు లు సాధించిపెట్టడంలో కీలక పాత్ర పోషించిన తమ యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌ను విమర్శించే స్థాయి టీబీజీకేఎస్ నాయకుడు రాజిరెడ్డికి లేదని కాంపెల్లి సమ్మయ్య అన్నారు. మందమర్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసలు పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో టీబీజీకేఎస్ చరిత్ర కార్మికు లకు తెలుసన్నారు. యూని యన్‌లో డబ్బుల కోసం గ్రూపులుగా ఏర్పడి కార్మికుల చందాల కోసం కోర్టుదాకా వెళ్లి వాటి పంపిణీ కోసం గొడవ పడ్డ చరిత్ర టీబీజీకేఎస్‌ది కాదా అని విమర్శించారు. సింగరేణిలో బీఆర్ఎస్ పాలనలో టీబీజీకేఎస్ ఆగడాలు అంతా ఇంతా కాదన్నారు. సింగరేణి నిధులను దారి మళ్లించడంలో ప్రధాన పాత్ర లేదా అని ప్రశ్నించారు. అనవసరంగా విమర్శలు చేస్తే సహించేది లేదని అన్నా రు. మిర్యాల రాజిరెడ్డి తన పదవి కోసం యూనియన్‌నే చీలక తీసుకు వచ్చి ఎన్నికలు తెప్పించిన ఘనత ఎవరికి తెలియదని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



అధికారుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ ఎన్ బలరాం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని సింగరేణి అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సంస్థ సీఎండీకి రాసిన వినతిపత్రాన్ని ఏరియా జీఎం సూర్యనారాయణకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులకు కూడా 2022-23కు సంబంధించిన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పీ) ఇవ్వాలన్నారు. కోల్ ఇండియాలో జూన్-2024లో చెల్లించగా, సింగరేణిలో ఇవ్వలేదన్నారు. ఈ విషయంలో అధికారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే పీఆర్‌పీ చెల్లించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నవంబర్ 25వ తేదీ 2024న అధికారుల సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు లక్కాకుల మహేష్, కె. కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఆర్ భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రెబ్బెన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నెలకొన్న సమస్యలను సీఎండీకి పంపించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని శనివారం బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్ షిప్‌లో జీఎం ఎం శ్రీనివాస్‌కు సీఎంఓఏఐ కార్యవర్గం వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారులందరికి జీతంలో భాగమైన పీఆర్ఆర్(పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) 2023కు సంబంధించి కోల్ ఇండియా జూన్ 2024న చెల్లించారని చెప్పారు. ఆ చెల్లింపులు సింగరేణి సంస్థలో ఇప్పటి వరకు చేయలేదని తెలిపారు. కార్యక్రమంలో కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షులు రమేష్, ఉజ్వల్ కుమార్, సంయుక్త కార్యదర్శి నరేష్, ఎండీ అహ్మద్, కోశాధికారి ఎం.రవి కుమార్ సంయుక్త కోశాధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

అపార్‌తో విద్యార్థుల సమగ్ర సమాచారం

దుర్గం చిన్నయ్య, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: అపార్ ఐడీ కార్డు అంటే ఏమిటి .?

ఎంఈవో: అపార్ ఐడీ అంటే (ఆటోమేటెడ్ పెర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) దీని ద్వారా ప్రతి విద్యార్థికి సంబంధించిన విద్యా సమాచా రం అంతా ఒకేచోట ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: అపార్ ఐడీ ద్వారా ఉపయోగం ఏమిటి .?

ఎంఈవో: ఆధార్ కార్డు గుర్తింపు ఎలా ఉంటుందో దాని మాదిరి గానే ప్రతి విద్యార్థికి అపార్ కార్డులో విద్యకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. దీని ద్వా రా భవిష్యత్తులో ఉన్నత చదువులకు, పోటి పరీక్షలకు అపార్ ఐడి నంబర్ ఎంటర్ చేస్తే సరిపోతుంది.

ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి ప్రిపరేషన్ అందిస్తున్నారు .?

ఎంఈవో: కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని పదో తరగతి విద్యార్థులకు ఉద యం, సాయంత్రం గంట చొప్పున విద్యా ర్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా విద్యా బోధన అందిస్తున్నాం. ప్రభుత్వం అందిం చే ప్రత్యేక సిలబస్ బుక్స్‌ను విద్యార్థులు ఇంటికి తీసుకెళ్లి ప్రిపేర్ ఆవడానికి అవకాశం కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ చేస్తున్నారా .?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలలపై ప కడ్బందీగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం. ప్ర భుత్వ పాఠశాలలకు పేద మధ్య తరగతి పిల్లలు వచ్చి చదువుకుంటున్నందున వా రికి విద్యబోధన సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-దండెపల్లి, ఆంధ్రజ్యోతి

పల్లెలకు విస్తరిస్తున్న సౌర వెలుగులు



- రూఫ్‌టాప్ సోలార్ సిస్టంపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- రాయితీ, బ్యాంకు రుణాలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- సోలార్ ఎనర్జీతో అదనపు ఆదాయం
- మండలానికి ఒక సోలార్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు

కాసిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కరెంటుకు స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయ కరెంటు సౌర వెలుగుల వినియోగంపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. పట్టణాలకే పరిమితమైన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు నేడు పల్లెల్లో సైతం దర్శనం ఇస్తున్నాయి. వీటితో వినియోగదారునికి అదనపు ఆదాయంతో పాటు కరెంటు ఉచితంగా లభించడంపై పల్లె ప్రాంతాల్లోని ప్రజలు రూఫ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు. వినియోగదారుడిపై ఆర్థికభారం పడకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలతో పాటు బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న విద్యుత్ వినియోగంతో కరెంటు బిల్లులు వినియోగదారునికి తడిసి మోపె డవుతున్నాయి.

రాష్ట్రప్రభుత్వం 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు ఇచ్చినా మధ్య తరగతి కుటుంబాలకు కరెంటు బిల్లులు భారంగా మారాయి. దీంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న యాజ మాని 300 యూనిట్ల వరకు వినియోగించుకుని అదనపు ఉత్ప త్తిని డిస్కంలకు అమ్ముకునే అవకాశం ఉంది. దీంతో యాజమా నికి అదనపు ఆదాయం రావడంతో పాటు విద్యుత్ ఉచితంగా వచ్చినట్లే. దీంతో జిల్లావ్యాప్తంగా రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల వినియోగం శరవేగంగా పెరుగుతోంది. దీని వినియోగంపై అధికారులు సైతం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పరంగా మండలానికి ఒక సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేపట్టి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు.

పెరిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల విస్తరణ

తెలంగాణ రినవేబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్‌కో) 2022లో విడుదల చేసిన గణాంకాల ప్రకారం మంచిర్యాల జిల్లాలో 2,433 మంది రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా 14.45 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రభుత్వం నుంచి వీరికి 14.59 కోట్ల రూపాయలను ప్రభుత్వం సబ్సిడీ అందజేసింది. రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలతో పాటు బ్యాంకు రుణాలను అంద జేస్తోంది. రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల పర్యావర ణం కలుషితం కాకుండా ఉండడంతో పాటు కాలుష్యాన్ని నియం త్రించుకోవచ్చు. ప్లాంటు నిర్వహణ సక్రమంగా ఉంటే ఇది 25 ఏళ్ల పాటు మనుగడలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కరెంటు ఫ్రీ గ్రామంగా వెంకట్రావుపేట

గ్రీన్ ఎనర్జీ పాలసీ కింద మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామాన్ని కరెంటు ఫ్రీ గ్రామంగా చేసేందుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ఏర్పాటు పనులను ముమ్మరం చేసింది. వెంకట్రావుపేటలో 1,415 కుటుంబాలు ఉండగా 346 వ్యవసాయ మోటారు పంపుసెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒక కుటుంబానికి 300 కిలోవాట్ల విద్యుత్ విని యోగం అవసరం కాగా వ్యవసాయ పంపుసెట్లకు ఐదు కిలోవాట్ల వినియోగం అవసరం పడు తుందన్నారు. ఈలెక్కన వెంకట్రావు పేటలో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు టీజీఎన్‌పీడీసీఎల్ నిర్మాణ చర్యలు చేపడుతున్నారు.

సోలార్ మాడ్యూల్స్‌తో పొంచి ఉన్న ముప్పు

సోలార్ ప్లాంట్ల వినియోగంపై భవిష్యత్‌లో ప్రమాదం పొంచి ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోలార్ ప్లాంట్ల కాలపరిమితి ముగిసిన తర్వాత సోలార్ సెల్స్ మాడ్యూల్స్ వ్యర్థాలను భూమిపై పారవేయడంతో అందులోని కాగ్నియం, టెల్యురైడ్ భూగర్భంలోని జలవనరుల్లో చేరి పర్యావరణానికి మేలు చేసే ఎన్నో రకాల సూక్ష్మ జీవులు చనిపోతాయని నిపుణులు అంటున్నారు. దీని ఫలితంగా పంటల దిగుబడి తగ్గుతుందని, వీటి అవశేషాలు మనం తాగే నీరు, పండించే తిండిగింజల రూపంలో మన శరీరంలోకి చేరితే అనారోగ్యంపై తీవ్రప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కాగ్నియం అవశేషాలు ఒంట్లోకి చేరితే మూత్ర పిండాలు దెబ్బతినే అవకాశం ఉంది. శ్వాస కోశ వ్యాధులకు ముప్పు పొంచి ఉంటుందన్నారు.

కరెంటు భారం తగ్గింది

ఉత్తూరి సత్తయ్య, కొండాపూర్ యాప, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ వినియోగదారుడు



మా ఇంటికి వేసవిలో కరెంటు బిల్లు నెలకు ఆరు వేల రూపాయలకు పైగా వచ్చేది. దీని వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాను. కరెంటు బిల్లు కట్టడం భారంగా ఉండేది. మూడు నెలల క్రితం ఆరు కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకున్నాము. మాకు సరి పడా విద్యుత్‌ను వినియోగించుకుంటూ మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు అమ్ముతు న్నాము. రూఫ్‌టాప్ సోలార్ కరెంటు భారాన్ని తగ్గించింది. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.

పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాలి

బండ శాంకరి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, పర్యావరణ సామాజికవేత్త



సాంకేతిక రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందడాన్ని స్వాగతిస్తున్నాం. అలాగే పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా అందరు బాధ్యతగా భావించాలి. సోలార్ ప్యానెల్స్ వినియోగం అనంతరం వాటిలోని వ్యర్థ భాగాలు సిలికాన్, కాగ్నియం, టెల్యురైడ్ వంటి పాలిమర్లను విచ్చలవిడిగా పడేస్తున్నారు. ఇవి క్యాన్సర్ కారకాలు కాబట్టి ప్రభుత్వం పటిష్ఠ నిబంధనలు రూపొందించి ఇప్పటి నుంచి జాగ్రత్త పడాలి. లేదంటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించి అందరినీ అప్రమత్తం చేయాలి.

సోలార్ ప్లాంట్ల వినియోగాన్ని విస్తృతం చేయాలి

గంగాధర్, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ, మంచిర్యాల

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తేడా లేకుండా సోలార్ ప్లాంట్ల విస్తరణ మరింత పెరగాలి. రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోంది. మిగులు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేసి యాజమానికి అదనపు ఆదాయాన్ని అందిస్తున్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల వినియోగం పెంచుకోవాలి. బంజరు భూములు, బీడు భూముల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని సాగు భూములుగా మార్చుకోవాలి. రైతులు ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టాలి. ప్రతీ మండలంలో సోలార్ ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపడుతోంది.

దైవ భక్తిని అలవర్చుకోవాలి

జైపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ కె శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఎస్టీపీపీలో ప్లాంట్ ఆవరణలో నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలను, అనంతరం యాగం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉద్యోగులు సుఖ శాంతులతో వర్ధిల్లాలని సీతారామచంద్ర ఆలయం నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ వర్ధంతి

గర్మిళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ కృష్ణరావు వర్ధంతిని శనివారం మంచిర్యాలలోని ఆనంద నిలయం ఆశ్రమంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కుటుంబీకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణరావు సతీమణి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాచకొండ మంజుల, తనయుడు రాచకొండ వెంకటేశ్వర్‌రావు, నాయకులు తాజ్‌బాబ, జాకీర్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ కంపెనీ ఏర్పాటు గొప్ప విషయం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాలకు పరిమితమైన ఐటీ కంపెనీ బెల్లంపల్లిలో సనాతన అనలైటిక్స్ వారు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టు ఆర్‌జే రత్నాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన సనాతన అనలైటిక్స్ ఐటీ కంపెనీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రత్నాకర్‌ను ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఐటీ కంపెనీ నిర్వహకులు, సత్యసాయి ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మాజీ వైస్ చైర్మన్ సుదర్శన్, ఐటీ కంపెనీ డైరెకర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



లక్సెట్టిపేటలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, నెన్నెలలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై బీజేపీ నాయకులు శనివారం జిల్లాలోని పలు మండలాల్లో సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచుకొని, టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. లక్సెట్టిపేట మున్సిపల్‌లోని ఊత్కూర్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో లక్సెట్టిపేట పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరి గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి సామ వెంకటమరణ, సాయి సచిన్, నాయకులు సతీష్, నరేష్‌జైన్, రమేష్ చందు, రవి, రాజగురువయ్య, రమేష్, సిద్ధార్థ సమరసింహ, సతీష్, వెంకటేష్, గంగన్న పాల్గొన్నారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేదరిపేట బస్టాండ్ వద్ద జరిగిన సంబరాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, గూడెం పీఏసీఎస్ చైర్మన్ బెదుడ సురేష్, పార్టీ నాయకులు సురేందర్, శ్రీనివాస్, రాములు, సంతోష్, రవీందర్, మల్లేష్, వెంకటేష్, రాకేష్, అశోక్, రాజన్న, సత్యం, రమణయ్య, సత్యం, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన సంబరాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, నాయకులు దుషాంత్‌యాదవ్, సురేష్, మల్లేష్, వినోద్, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్, నాయకులు శైలెందర్ సింగ్, కోట వంశీ, లింగంపల్లి మహేష్, గట్టు పవన్ కళ్యాణ్, అల్లంపల్లి స్వామి, కామెర మొగిలి తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరిగిన విజయోత్సవంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధూకర్, మండల ప్రధానకార్యదర్శి ఎనుముల వెంకటేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కంపెల అజ య్‌కుమార్, సీనియర్ నాయకులు పుల్లయ్య, స్వామి, అంజి, మధునయ్య, ప్రభాకర్, సతీష్,అంజిబాబు పాల్గొన్నారు.

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండు నుంచి పాత బస్టాండు వరకు బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు వెంకటనర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక పారిశుధ్య పనులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఊరు మందమర్రి మినీ ట్యాంక్‌బండ్‌పై శనివారం మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. కమిషనర్ రాజలింగు పనులను పర్యవేక్షించారు. ట్యాంక్‌బండ్ చుట్టూ ఉన్న చెత్తచెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. చెరువు కట్టకు ఆనుకొని ఉన్న వాకింగ్ ట్రాక్‌పై ట్రాక్టర్‌తో లెవల్ చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి సదానందం మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మందమర్రికి వచ్చిన ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించామన్నారు. వెంటనే ఆయన స్పందించి ట్యాంక్‌బండ్ సుంద రీకరణకు ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టేలా అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వాకర్స్ అసోసియేషన్, ప్రజలు తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

పంచాయతీలు మార్చాలంటూ ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే నాలుగు పంచాయతీలు పెరిగి మొత్తం 310 జీపీలు ఉండనున్నాయి. జిల్లాలో రెండు పంచాయతీ డివిజన్లలో 16 మండలాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నాయి. గతంలో 130 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు స్థానాలు విలీనం అయ్యాయి. కొత్తగా భీమిని, భీమారం మండలాల్లో అధనంగా రెండు స్థానాలను పెంచుతుండగా, మొత్తం ఎంపీటీసీ స్థానాల సంఖ్యకు 129కి చేరనుంది. అలాగే జడ్పీటీసీ స్థానాలు 16, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. వీటికిగాను తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుండగా, అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి జిల్లాకు ఇప్పటికే చేరింది.

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు



బెల్లంపల్లిలో రైళ్లు రద్దు అయినట్లు ఏర్పాటు చేసిన బోర్డు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కొమురంభీంఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని సిర్పూరు కాగజ్‌నగర్, రెబ్బెన, బెల్లంపల్లి, మంచిర్యాల రైల్వే స్టేషన్ల గుండా వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లు ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు రద్దయ్యాయి. సికింద్రాబాద్ నుంచి సిర్పూరు కాగజ్‌నగర్‌కు (17233) వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి 20 వరకు, సిర్పూరు కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్(17234) వరకు వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 21 వరకు రద్దు అయ్యింది. కొచ్చి టూ కోర్బా ఎక్స్‌ప్రెస్ (22648) ఈ నెల 11,14,18 తేదీల్లో రద్దు అయ్యింది. కోర్బా టూ కొచ్చి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22647) ఈ నెల 13,16,20 తేదీల్లో రద్దు అయ్యింది. గోరఖ్‌పూర్ నుంచి కొచ్చికి వెళ్లే రప్తిసాగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12511) ఈ నెల 15,17 తేదీల్లో రద్దు అయ్యింది. అలాగే కొచ్చి టూ గోరఖ్‌పూర్‌కు వెళ్లే రప్తిసాగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12512) ఈ నెల 19, 20 తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇండోర్ నుంచి కొచ్చికి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22645) రూటు మళ్లించినట్లు తెలిపారు.

నియామకం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీరాంపూర్‌కు చెందిన జింజుపల్లి నర్సింగ్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. కమలాకర్ నియమించారు. అనంతరం నియామక పత్రం అందజేశారు. కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా సమష్టిగా కృషిచేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నర్సింగ్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

జంతు సంరక్షణ కేంద్రానికి వీధి కుక్కల తరలింపు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధి కుక్కలను పట్టుకొని జంతు సంరక్షణ కేంద్రానికి శనివారం తరలించారు. మంచిర్యాల పట్టణం 11వ వార్డులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ కాలనీ వాసులను ఇబ్బంది పెడుతున్నాయంటూ ఫిర్యాదులు రావడంతో మంచిర్యాల నగర పాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వైకుంఠం, ఉదయ్‌కిరణ్ సిబ్బందితో కలిసి వీధి కుక్కలను బంధించి జంతు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

హనుమాన్ చాలీసా పారాయణం

దండేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేదరిపేటలో భక్తాంజనేయస్వామి మందిరంలో ఏకాదశిని పురస్కరించుకొని హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం దండేపల్లి, మేదరిపేట, తాళ్లపేట గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు తదిరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, సమాజానికి వైద్యుల సేవలు ఎంత ముఖ్యమో పోలీసుల సేవలు అంతే ముఖ్యమని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. శనివారం ఎం కన్వెన్షన్ హాల్‌లో టచ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చిన్నచిన్న నిర్లక్ష్యాల వల్లనే పోలీసు అధికారులు, సిబ్బంది గుండెపోటుతో మరణిస్తున్నారన్నారు. నెల రోజుల్లోనే ముగ్గురు గుండెపోటుతో మరణించడం విచారకరమన్నారు. ప్రతీఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పోలీసు అంటేనే ఒత్తిడితో కూడిన ఉద్యోగం అన్నారు. ఒత్తిడికి లోను కాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే విధులు నిర్వర్తించాలని సూచించారు. మంచిర్యాల, బెల్లంపల్లి డివిజన్‌లో సుమారు 500 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారని, వారందరికి ఉచితంగా హెల్త్ చెకప్ చేసేందుకు ముందుకు వచ్చిన ఆస్పత్రి సిబ్బందిని అభినం దించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, సీఐలు సత్యనారాయణ, ఆకుల అశోక్, ఎస్సైలు, ఏఎస్సైలు, కార్డియాలజిస్టు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుంది

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక ధృఢత్వం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం పట్టణంలోని తిలక్ స్టేడియంలో బీఆర్ఎస్ టౌన్‌యూత్ ప్రెసిడెంట్ సబ్బని అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. గెలుపోటములు సహజమన్నారు. టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న సబ్బని అరుణ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ టౌన్‌ప్రెసిడెంట్ నూనెటి సత్యనారాయణ, లక్ష్మణ్, గోపి, చంద్రశేఖర్, మనోహర్, సాయి, మహేష్, సురేష్, ఆర్గనైజర్‌లు మంజుకిరణ్, బండారి రవీందర్, రాకేష్,అన్వేష్, అభి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

మాంజా దారానికి చిక్కిన పావురం

- కాపాడిన కార్పొరేషన్ సిబ్బంది



మాంజా దారానికి చిక్కుకున్న పావురం


నస్పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సీసీసీ కార్నర్ సమీపంలో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ పోల్‌కు ఉన్న మాంజా దారం పావురం కాలికి చుట్టుకోవడంతో అక్కడే చిక్కుకుపోయింది. రెండు రోజుల నుంచి పావురం అలాగే విలవిలలాడుతోంది. తోటి పావురాలు కూడా దానికి తోడుగా వాలి అక్కడే చూస్తుండిపోయాయి. పావురాల గుంపు పోల్ పైన చుట్టూ తిరుగుతుండడం ఓ పావురం ప్రాణ పాయ స్థితిలో కొట్టుకుంటుండగా చూసిన స్థానికుడు కమలాకర్‌రావు శనివారం ఫోన్ ద్వారా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సమాచారం అందించారు. వెంటనే కార్పొరేషన్ ఎలక్ట్రిషియన్లు కొయ్యల వెంకట్, వెంకటి అక్కడికి చేరుకుని నిచ్చెన వేసుకుని కర్ర సాయంతో దారాన్ని తెంపివేశారు. దీంతో పావురాలన్నీ ఒక్కసారిగా ఎగిరిపోయాయి.

జాతర పోస్టర్ల ఆవిష్కరణ

కాసిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14,15,16 తేదీల్లో జరిగే బొక్కలగుట్ట గాంధారి ఖిలా మైసమ్మ జాతర పోస్టర్లను శనివారం మండలంలోని కొండాపూర్ యాపలో ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్యదైవం గాంధారి మైసమ్మ జాతరను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకపోడ్‌సేవా సంఘం నాయకులు మేండ్రపు రాజయ్య, మంగ శ్రీకాంత్, మడావి గంగారాం, గుండ రాజ్‌కుమార్, కొడప భీంరావు, సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎస్‌టీపీపీ యూనిట్-1లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జైపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌టీపీపీ యూనిట్-1లో విద్యుత్ ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. బాయిలర్ ట్యూబ్ లీకేజ్ కారణంగా శనివారం సాయంత్రం నుంచి ఉత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు.

విద్యార్థులకు అవగాహన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థులకు శనివారం కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ శారద, కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బొంకూరి ప్రవీణ్‌కుమార్ ఔషధాల తయారీ, వినియోగం, వివిధ రకాల ఔషధాలు, అవి పనిచేసే విధానాలు, కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఇవి చాలా ఉపయోగకరమని తెలిపారు. ఔషధాల వినియోగం గురించి విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు వంశీకృష్ణ, పాల్గొన్నారు.

వరిపేటలోనే పెద్దపులి

కాసిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరిపేట గ్రామ శివారు ప్రాంతంలోని చెరువు సమీపంలోనే పెద్దపులి సంచరిస్తుందని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. రెండురోజులుగా అడవి పందిని వేటాడి వరిపేట శివారులోనే పులి ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు.

పీఈటీల పోస్టర్ విడుదల

గర్మిళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పీఈటీల ఎజెండా పోస్టర్‌ను శనివారం డీఈవో కార్యాలయంలో మంచిర్యాల జిల్లా విద్యాధికారి లలిత విడుదల చేశారు. పీఈటీల భవిష్యత్ కార్యచరణలో భాగంగా రాష్ట్ర అడ్‌హక్ కమిటీ పిలుపు మేరకు పీఈటీ ఎజెండా పోస్టర్‌ను విడుదల చేశామని ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు మూర్తి తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ చౌదరి, సత్యనారాయణ మూర్తి, నాయకులు శ్రీనివాస్, యాదగిరి, తిరుపతి, రజనీ, నటరాజ్ పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికలకు సన్నద్ధం

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- 15వ తేదీ తర్వాత షెడ్యూల్ విడుదలకు సన్నాహాలు
- 10లోగా రిటర్నింగ్ అధికారుల నియామకం

రిజర్వేషన్లలో మార్పులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. పంచాయతీ వార్డులు మొదలుకొని జడ్పీ చైర్మన్ స్థానం వరకు క్షేత్రస్థాయిలో రిజర్వేషన్లు మారనున్నాయి. రాష్ట్రంలో బీసీ కులగణన సర్వే పూర్తయినందున ఆ సామాజిక వర్గానికి సంబంధించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇప్పుడున్న స్థానాలకు అదనంగా సీట్లు కేటాయింపు జరుగుతుంది. దీంతో ఇంతకాలం రిజర్వేషన్లు అనుకూలించక పోటీకి దూరంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలకు కులగణన అనంతరం ఆ అవకాశం లభించనుంది. రిజర్వేషన్లు మారనుండటంతో సర్పంచ్ ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ఆశావహులు ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే కుతూహలంతో ఉన్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయడం ద్వారా రిజర్వేషన్లు పదేళ్ల వరకు ఉండేలా మార్పులు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లకోసారి రిజర్వేషన్లలో మార్పులు చేసేలా చట్ట సవరణ చేయడంతో ఇకమీదట ప్రతీసారి వివిధ వర్గాలకు అమలు చేసే రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకోనున్నాయి.

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆ తరువాత సర్పంచ్ ఎలక్షన్లు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 15వ తేదీ తరువాత ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికలు ముగియగానే, స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. గ్రామపంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం జూలై మాసంతో ముగిసింది. దీంతో స్థానికసంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది.

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఈసీ సిద్ధంకాగా ఎలక్షన్లకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10వ తేదీలోగా పీవోలు, ఏపీవోలు, రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం ఇదే నెల 15లోగా వారికి శిక్షణ కార్యక్రమం కూడా పూర్తి చేయాలని ఈసీ పేర్కొనడంతో జిల్లా అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు.

జిల్లాలో 129 ఎంపీటీసీ స్థానాలు..

స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలోని 613 గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. గతంలో మొత్తం 311 గ్రామపంచాయతీలకు గాను హాజీపూర్ మండలంలోని ఐదు జీపీలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. దీంతో జీపీల సంఖ్య 306కు పడిపోగా, జైపూర్ మండలంలోని గోపాల్‌పూర్, కాసిపేట మండలంలోని వరిపేట, జన్నారం మండలంలోని చర్లపల్లి, మొర్రిగూడ గ్రామాలను మిగతా 7వ పేజీలో

పల్లెలకు విస్తరిస్తున్న సౌర వెలుగులు

- రూఫ్‌టాప్ సోలార్ సిస్టంపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- రాయితీ, బ్యాంకు రుణాలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- సోలార్ ఎనర్జీతో అదనపు ఆదాయం
- మండలానికి ఒక సోలార్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు



7

నాణ్యమైన విద్యుత్తుకు ప్రణాళిక సిద్ధం

- వేసవి నేపథ్యంలో అధికారుల చర్యలు
- ఓవర్‌లోడ్ తగ్గించడానికి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

6

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి జిల్లాలోని మంచిర్యాల పట్టణం సాయికుంట ప్రాంతంలో గల వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి వంటశాల, భోజనం తయారీ విధానం, గదులు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతోపాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. శారీరక కార్యకలాపాలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థుల సంక్షేమంపై నెలవారీ పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి వసతి గృహంలో రాత్రి బస చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి శ్రీహరి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులతో కలిసి బస చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పద్మల్‌పురి కాకో అమ్మవారి విగ్రహం ధ్వంసం

దండేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున గల పద్మల్‌పురి కాకో అమ్మ వారి విగ్రహం శనివారం పాక్షికంగా ధ్వంసమైంది. నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ (లక్ష్మీపూర్) గ్రామానికి చెందిన కోమురం లక్ష్మణ్ అనే మతి స్థిమితంలేని వ్యక్తి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసినట్టు సమాచారం. స్థానికులు ఆలయ కమిటీ నిర్వాహకులకు సమాచారం అందించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సంఘటన స్థలానికి చేరుకొని ధ్వంసం చేసిన వ్యక్తిని పట్టుకొని దండేపల్లి పోలీసుస్టేషన్‌కు అప్పగించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహాప్రస్థానం పనులను త్వరగా పూర్తిచేయాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గోదావరి నది తీరాన మహా ప్రస్థానం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మహాప్రస్థాన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా ప్రస్థానం పనులను శివరాత్రి వరకు పూర్తిచేస్తామని తెలిపారు. సంబంధిత అధికారులకు పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిట్ల తిరుపతి, తూముల నరేష్, పూదరి తిరుపతి, ముని, చందు, మార్కెట్ కమిటి చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక



అభినవ్, శ్రీకాంత్

నస్పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీని శనివారం ప్రకటించారు. జిల్లా కార్యదర్శిగా ఈదునూరి అభినవ్, అధ్యక్షుడిగా దాగం శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలుగా శ్రావణి, సహాయ కార్యదర్శులుగా దినేష్, నిఖిల్‌తో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అభినవ్, శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలన్నారు. మహిళ రక్షణ చట్టాలను పకడ్బందీ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపించిందని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కనీస కేటాయింపులు లేకపోవడం అన్యాయమన్నారు. దోపిడీ వర్గాలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కోసమే పనిచేస్తుందని, సామాన్య ప్రజలను విస్మరిస్తుందన్నారు. ఉపాధిహామీ పథకం నిధులకు కోత విధించారని, వ్యవసాయరంగానికి సరైన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్రానికి పెద్దఎత్తున నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రాహుల్, కృష్ణ, ఆకాష్, రవి పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి మండల అధికారులు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతితో కలిసి నోడల్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎన్నికల సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాసనమండలి సభ్యుల ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలను నిబంధనలకు లోబడి సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో పట్టభద్రుల శాసనమండలి సభ్యుల ఎన్నిక కోసం 40 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ఎన్నికకు 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ భాస్కర్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాల నివారణకు అన్ని కాలనీల్లో నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అన్ని వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలు తెలుసుకొని, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం ఆయన సిబ్బంది ఆరోగ్య పరిస్థితులు, సంక్షేమం, డయల్ 100 రెస్పాన్స్ గురించి తెలుసుకొని, బ్లూ కోల్ట్స్, ప్రొ కార్ విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ వేణుచందర్, ఎస్ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విహారయాత్రతో వినోదం.. విజ్ఞానం



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

దండేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటనతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరుగుతుందని దండేపల్లి హైస్కూల్ ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్ అన్నారు. దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరోతరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 190మంది విద్యారులు విజ్ఞాన యాత్రలో భాగంగా కడెం ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, బాసర జ్ఞాన సరస్వతీదేవి దేవాలయంతో పాటు నిర్మల్‌లో కొయ్య బొమ్మ కేంద్రాన్ని సందర్శించామన్నారు. ప్రత్యక్షంగా చూడటంతో విద్యార్థుల్లో నైపుణ్య అభివృది చెందుతాయని ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.